# ప్రేమయే దైవము

లోకమందు పెక్కు భీకరకృత్యముల్
జరుగు కారణంబు అరయ వలయు
స్వార్థ రహిత సేవ సన్నగిల్లుట చేత
అర్థ రహిత వాంఛలధికమయ్యె

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దానిబట్టి
మనవత్వమడగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు

నేను వెలుగులోనున్నాను వెలుగు నేనె
వెలుగు నాలోన నున్నది వెలుగునేనె
అన్నభావము హృదయాన హత్తుకొన్న
అట్టి మనుజుడె బ్రహ్మలో ఐక్యమగును.

ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తునందు అనేక శిరస్సులు, అనేక నేత్రములు, అనేక పాదములతో కూడిన స్వరూపము భగవంతుడే. ఇట్టి నిత్యమైన దివ్యత్వమును మన సమీపమునందే ఉంచుకొని మనము అనంతమైన జగత్తునందు అన్వేషణ సలుపుతున్నాము. పెరటియందున్న కామధేనువు వదలి ప్రక్క ఇంటికి పాలకోసమై పరుగెత్తినట్లుగా, ఇంటియందు జ్యోతివెలుగుచుండగా పొరుగింటికి అగ్గికి అడుగనేల. ఈనాటి మానవుడు దివ్యత్వమై పవిత్రమై అనంతమై నిత్యమై సత్యమై ఉండిన దివ్యత్వమును తనయందే ఉంచుకొని అట్టి దివ్యత్వము పవిత్రము మనము

sri sathyasai vachanamrutam

వెలుపల ఉన్నదని వెదకటము ఇది కేవలము వెఱ్ఱితనము.

ప్రకృతియొక్క చిత్రములు విచిత్రములు, ఎవరు గుర్తించలేరు. వర్ణించలేరు

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతా లవిత్రంబులు స**
**న్మిత్రంబులు ముని జనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

దైవత్వము ఇట్టిది అట్టిదియని వర్ణించుటకు వీలుకానట్టిది. ప్రకృతి లీలా స్వరూపము ఈ ప్రకృతికి త్రిగుణములే ప్రాణములు. ఈ త్రిగుణములే త్రిమూర్తి స్వరూపములు. త్రిగుణములయొక్క స్వరూప స్వభావములతో, విశేష వికారములతో, విలాస రసోల్లాసముతో ప్రకృతిని పోషించి, రక్షించి, లాలించి, పాలించుచున్నది భగవంతుడు. ఇట్టి ప్రకృతియొక్క స్వరూపమును దివ్యత్వముగా భావించి అందులో పవిత్రముగా మనము అనుభవించటమే జీవితము యొక్క పరమావధి.

**అంతర్దృష్టిని పొందండి**

కాలము చాలావిలువైనది. కాలము ఎవరి నిమిత్తమై ఆగదు. కాలమును అందరు అనుసరించవలసినదే గాని కాలము ఎవ్వరినీ అనుసరించదు. అట్టి కాలమును కర్మలద్వారా సార్థకము గావించుకున్నప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారుతుంది. కాలము చాలావిలువైనది, బలమైనది, అనుభవించవలసినది, ఆనందించవలసినది. అట్టికాలమును కాయము ద్వారా కర్మలచేత సార్థకము చేసుకోటమే మానవత్వము యొక్క కర్తవ్యము. కర్మానుబంధీని మనుష్యలోకే. మానవుడు కర్మలచేత బంధింపబడినాడు. అయితే ఇట్టి దివ్యత్వము, మన చుట్టూ మనయందు, సర్వత్ర వ్యాపించినప్పటికిని అట్టి దివ్యత్వమును మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. తమచుట్టూ ఉండిన గాలినే తాను పట్టలేకపోతున్నాడు. తనయందున్న తేజస్సుతో తాను చూడలేకపోతున్నాడు. విశ్వమంతయు దేని నిమిత్తమై నీవు తిరిగితివో అది నీయందే ఉన్నదనే సత్యాన్ని నిరూపిస్తుంది. సర్వత్ర ఉండిన దైవత్వమును వెదకటము ఎక్కడ. అంతర్ బహిశ్చతత్ సర్వంవ్యాప్య నారాయణ స్థితః లోపల వెలుపల



sri sathyasai vachanamrutam

సర్వత్రా ఉండిన దివ్యత్వమును వెదకటమెందుకు. అయితే ఈనాటి మానవుని దృష్టి బహిర్ముఖములో అభివృద్ధిగావించుకుంటూ వచ్చింది. అంతర్దృష్టిని విస్మరించి బహిర్దృష్టిని విశ్వసించి మానవుడు కేవలము వివేకమును కోల్పోతున్నాడు.

మోహన మురళీగానములు విన్న గోపికలు మత్తులై ఉన్మత్తులై ప్రేమోన్మత్తులై కృష్ణుని వెదకుటకై బృందావనమునకు పరుగెత్తారు. ఎందుగలడోనని విచారముతో పొదలు పొదలు వెదికారు. పువ్వు పువ్వును ప్రశ్నించారు. కారణము. తమయందే నిత్యమై సత్యమై ఉండిన దివ్యస్వరూపము విస్మరించి బాహ్యమైన స్వరూపమును ఆకర్షించి ఆనందించి ఆ ఆనందమును పొందేనిమిత్తమై ప్రాకులాడుతూ వచ్చారు. కేవలము భౌతికమైన దృష్టిచే, భౌతికమైన రూపమునే ఆనందించవలెనని తగిన కృషి చేస్తూ వచ్చారు. భగవంతునకు ఒక రూపము ఒక నామము ఒక రంగు లేదు. కాని గోపిక చిత్తములో హత్తుకున్న కృష్ణుని రూపము నిరంతరము వారు మరువలేకపోయారు. ఒక్కొక్క వృక్షము చెంతకు వెళ్ళారు. ఒక్కొక్క పూవు చెంతకు వెళ్ళారు.

**నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై**
**జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వురా**
**జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబుదోచెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే.**

అని ఒక్కొక్క పుష్పమును ప్రశ్నిస్తూ వచ్చారు. కృష్ణుని వర్ణిస్తూ వచ్చారు. ఇవన్నీ కూడను ప్రేమయొక్క వికార చేష్టలు. ఈ ప్రేమ లేకుండిన పరమాత్మలేడు. ప్రేమదైవము. దైవము ప్రేమ. ఇట్టి ప్రేమ స్వరూపమైన దైవత్వమును ప్రేమద్వారా పొందాలి.

**ప్రేమ రహిత మరు భూములలో ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో ప్రేమసుధావర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహించగ**
**మురళీగానము చేయగదే కృష్ణా మురళీగానము చేయగదే!**

ప్రేమ రహితమగు భూమిలో. హృదయమే ప్రేమ రహితమైన భూమి. ప్రేమ అనే విత్తనములు ఇందులో చల్లి ప్రేమావేశముతో ప్రేమ సుధావర్షము వర్షింపగ ప్రేమ నదులు ప్రవహింపగ

srisathyasaivachanamrutam

మురళీగానము చేయగదే. నీ మురళి ప్రేమమయమై ఉంటుండాది. ఎప్పుడు ఈ మురళి ప్రేమమయముగా, సుస్వరముగా, మధురమైన స్వరము నందిస్తుంది. ఈ మురళి యందుండిన స్వరూపమును మనము కొంత వరకు విచారించాలి. మురళికి నవరంధ్రములు అందులో ఏది కూడను అటు ఇటు అడ్డు తగలటానికి వీలు లేదు. అప్పుడే ఈ భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు సుస్వరమైన దీంట్లో మధురానందమునందిస్తుంది. అదియే మనదేహము. ఈ దేహమునకు కూడను నవరంధ్రములు. ఇందులో విషయ వాసనలు అనేవి అడ్డుతగిలినపుడు సుస్వరములు ఏమాత్రము వినిపించవు. ఈ మురళిని మనం పూర్తి గాలిమయముగా మార్చాలి. అదే భగవంతుని యొక్క భావము. భగవంతుని యొక్క ప్రేమ లీల. అప్పుడే మన జీవితము ధన్యమై పవిత్రమై ఆదర్శవంతమై ఆనందవంతమై అనేకవిధములుగా జీవితము సార్థకత గావిస్తుంది. ఇట్టి దివ్యత్వము మనము అనుభవించవలెనన్న, ఆనందించవలెనన్న, పరులకు అందించవలెనన్న మన హృదయము పవిత్రమై నిర్మలమైన నిస్వార్థమైనదిగా మార్చుకోవాలి.

**అంతరార్థములు గ్రహించండి**

యుగయుగములనుండి, తరతరములనుండి ఇట్టి దివ్యబోధలు మనము వింటున్నాము చదువుతున్నాము. కాని ఆచరణలో పెట్టటానికి తగిన కృషి చేయటం లేదు.

**అంధకారం బెల్ల హతమారునే చూడ**
**వసుధలో దీపంబు వార్తవలన**
**ఆకొన్నవారికి ఆకలి తీరునే**
**పంచభక్ష్యంబుల పాకము విన**
**నిరుపేదవాని పేదరికము పోవునా**
**విత్తప్రభావంబు విన్నయంత**
**రోగపీడితుని బల్‌రోగముల్ పోవునా**
**ఔషధమహిమంబు నంత విన్న**

మనము చదువుతున్నాం. వింటున్నాం కానీ తినటం లేదు. అందువలనే అనేక జన్మలనుండియు భారతీయులు ఇన్ని రకములైన సాధనలు సలుపుతూ కూడను ఉన్నత స్థానమును

చేరలేకపోతున్నారు. ఏ ఒకటి రెండుకూడను ఆచరణలో పెట్టినప్పుడే ఈ ఆనందమునకు అర్హులమవుతాము. ఈనాటి పవిత్రమైన పర్వదినముయొక్క విశేషము కొంతవరకు మనము విచారించినప్పుడు చారిత్రకంగా కృష్ణుడు నరకాసురుని చంపటం అతని బారినుండి ప్రజలను రక్షించటం మాత్రమే ఈ ఆనందమైన సుదినముగా భావిస్తూ వచ్చాము. మొట్టమొదట కృష్ణతత్త్వము మనము గుర్తించినప్పుడే నరకతత్త్వాన్ని అర్థము చేసుకోటానికి అర్హులమవుతాము.

కృష్ణ అనగా పంచభూత స్వరూపమే. పంచప్రాణముల స్వరూపమే కృష్ణుడు. క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా అని భాగవతము యొక్క సారాంశము. పంచప్రాణములు. క్లీం అనగా పృథ్వి. కృష్ణాయ ఉదకము, గోవిందాయ అగ్ని, గోపీ జనవల్లభాయ వాయువు, స్వాహా-ఆకాశము. కనుక పంచభూత స్వరూపుడే పరమాత్ముడనే సత్యాన్ని గుర్తించినపుడు పంచభూతములు లేని ప్రదేశము ఈ జగత్తులో కానరాదు. సర్వత్రా పంచభూతములే. ఈ పాంచభౌతికమైన దేహమునందు పంచభూతములు ఉంటున్నాయి. ఈ పంచభూతములు పాంచభౌతికమైన దేహమును మాత్రమే బాధించటము. ఆత్మ పంచభూతరహితమైనది కనుక దానిని ఎవ్వరు కూడను ఏవిధముగా బాధించలేరు. కృష్ణుణ్ణి భాగవతమునందు అనేక రీతులుగా అర్థరహితమైన విధముగా వర్ణిస్తూ వచ్చారు. అనేక రకములుగా విమర్శిస్తూ వచ్చారు. అర్థము తెలియని వ్యక్తులు విమర్శిస్తూ రావటంలో అర్థరహితమైన విమర్శలే.

ప్రతి మానవుని దేహమందు షట్ చక్రములున్నాయి. ఈ షట్ చక్ర స్వరూపమే మానవుని దేహము. ఇందులో ప్రధానమైనవి రెండు చక్రములు. ఒకటి హృదయ చక్రము. రెండవది సహస్రార చక్రము. దీనినే హృదయ కమలము, సహస్రార పద్మము అన్నారు. ఈ హృదయ కమలమునందు అష్టదళములు ఉంటున్నాయి. ఈ అష్ట దళములు అష్ట లోకములు. అష్ట దిక్కులు, అష్ట పాలకులు, అష్ట భూములు, ఈ అష్ట దళములు తన స్వాధీనమునందు ఉంచుకున్నవాడు కనుకనే కృష్ణునికి అష్టపత్నులు ఉన్నారని అన్నారు. అష్ట దళములకు పతిగా భావిస్తూ వచ్చారు. అష్టరాణులు అని వీరికి పేరు. అష్టరాణులని అంటే అష్ట భార్యలు కారు. అష్ట దళములు తన స్వాధీనమునందుంచుకున్నవాడు కనుక పతి ఆధీనములో ఉండునది

srisathyasaivachanamrutam

సతి. అని దీనికి అర్థము. భరించేవాడు భర్త. భరింపబడేది భార్య అని ఇంతేగాని లోకసంబంధమైన భార్యా భర్తలవలెకాదు. ఈ విధమైన అర్థములు తీసుకోవటం చేతనే భాగవతమందు అనేక విమర్శలు బయలుదేరాయి. హృదయకమలము నందుండిన అష్టదళములు భగవంతుని అధీనము నందున్నాయి. అవియేమిటి

**శబ్ద బ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి**
**నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి**

ఈ అష్టదళములు భగవంతుని అధీనము నందుంటున్నాయి. అందువల్లనే భగవంతుని అష్టైశ్వర్య స్వరూపుడని అన్నారు. కృష్ణుని అష్టపత్నులు అనగా అష్ట దళములే అష్ట పత్నులు. ఇంక పదహారు వేలమంది గోపికలు. ఎవరు? భౌతికమైన స్వరూపము ధరించిన గోపికలు కాదు. సహస్ర దళములతో కూడిన ఈ శిరస్సు నందుండిన పద్మము. ఈ సహస్ర దళము యొక్క ఒక్కొక్క దళమందు పదహారు కళలుంటున్నాయి. అందువలనే షోడశ కళా స్వరూపుడని. ఈ పదహారు కళలతో వేయి దళములను హెచ్చించినప్పుడు ఇది 16000 అవుతుంది. అదే పదహారు వేల మంది గోపికలు. సహస్రార పద్మమునందు 16000 కళలు ఉంటున్నాయి. మూలాధారము ప్రారంభించి సహస్రారములో ప్రయాణము చేసినప్పుడు ఈ కుండలినీ శక్తి ఈ పదహారు వేల కళలతో ఏకమైపోతుంది. అంతరార్థమును గుర్తించక బాహ్యార్థమునకు అభివృద్ధి పరచి నానార్థమును పెంచుకొని యదార్థమును వదలి పెట్టి అనర్థముతో జీవించుచున్నారు మానవులు.

**తమసోమా జ్యోతిర్గమయ**

నరకుడు. నర అనగా ఆత్మ. నరకమనగా ఆత్మకు విరుద్ధమైనది. నరకుడు అనగా రాక్షసుడు కాదు. ఒక ఉపగ్రహము. ఈ భూమి చుట్టూ తిరిగే గ్రహములలో నరకుడు అనేది ఒక చిన్న గ్రహము. ఈ గ్రహము భూమికి సమీపించగా ఏవిధమైన ప్రమాదము వచ్చునోయని ప్రజలలోపల భయాందోళనలు అభివృద్ధి కావటం చేత వీరి భయాందోళనలు దూరముగావించే నిమిత్తము కృష్ణుడు ఈ నరకుడనే ఉపగ్రహమును ఖండించాడు. ఇది సహజంగా అప్పుడప్పుడు ప్రాకృతికమైన స్థితిని పొందుతుంటాయి. కొన్ని సంవత్సరములకు పూర్వము అష్టగ్రహ కూటమి

అనేది ఒకటి ప్రారంభమై ప్రజలను చాలా ఆందోళన పరచింది. అదే విధముగనే ఐదు వేల సంవత్సరములకు పూర్వము నరక అనే ఉపగ్రహము భూమికి సమీపముగా ప్రజలకు చాలా భయాందోళనలు గలిగించింది. అట్టి ప్రజల బాధలను నివారణగావించి వారికి ధైర్యోత్సాహములనందించే నిమిత్తమై కృష్ణుడు ఆదుకొని ఆదరించాడు. అట్టి పవిత్రమైన సుదినమునే నరకాసుర వధ దీపావళి అని మనము అనుభవిస్తున్నాము.

అనగా తమసోమా జ్యోతిర్గమయ, మనస్సునందు ఆవరించిన అజ్ఞానము, అంధకారము, నిర్మూలముగావించి ప్రకాశము ప్రకాంతిని అందించే దివ్యత్వమునకే జ్యోతియని పేరు. వేయి దీపములార్పే చేయికంటే ఒక్క దీపము అంటించే చేయి చాలా ఉత్తమమైంది. మనము దీపావళి దినము ఒక్కొక్క లైటును ఒక్కొక్క దానముగా మనము అనుభవిస్తూ ఉంటాము. ఇది కొన్ని కొన్ని ప్రాంతీయ అభిమానములు పురస్కరించుకొని జరుగుతూ ఉంటాయి.

ఐతే చారిత్రకముగా చూసినప్పుడు నరకాసురుడు ఒక రాక్షసుడని భావిస్తున్నారు. ఈ రాక్షసుడు ఎక్కడ ఉంటున్నాడు. ప్రాగ్జ్యోతిషపురము ఇతని ముఖ్య పట్టణము. ప్రాగ్జ్యోతిష అంటే అర్థము ఏమిటి? ప్రాముందు. జ్యోతి వెలుతురు. షా మరచిన వారు. ముందు జ్యోతిని మరచిపోవటమే ప్రాగ్జ్యోతిషపురమని. మనముందు జ్యోతి ఏమిటి? ఆది జ్యోతి. ఆది జ్యోతినే ఆత్మజ్యోతి. ఆత్మజ్యోతిని మరచిపోవటమే రాక్షసత్వానికి చిహ్నము. ఆత్మను మరచటం చేత అనేక అసురత్వములు మనలో అభివృద్ధి గాంచుతుంటాయి. ఈనాటి జగత్తునకు ఈ అశాంతికి, అనాచారమునకు, అసత్యములకు మూలకారణము ఆత్మను మరచిపోవటమే. దేహాత్మనభివృద్ధి పరచుకొని జీవాత్మను విస్మరించి, పరమాత్మను పూర్తిగా వదలిపెడుతూ ఉన్నాము. ప్రతి మానవుడు అహం జీవాత్మ, అహందేహాత్మ అని రెండింటి వరకే ప్రయాణము సల్పుతూ ఉన్నాడు. అహం పరమాత్మ అనేస్థానం వరకు చేరటం లేదు.

కారణము మానవునియందు పంచకోశములుంటున్నాయి. అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము. అన్నమయము ఈదేహము. దేహానికి తగిన పోషణలన్నీ ఏది తప్పినాగానీ ఇది మాత్రం తప్పటంలేదు. దానిని పోషించుకుంటున్నాం. ఇంక ప్రాణమయము. అది లేకపోతే దేహము లేదు. ప్రాణాన్ని కూడను

sri sathyasai vahini amrutam

సాధ్యమైనంత వరకు కాపాడుకోటానికి పూనుకుంటున్నాము. ఇంక మనస్సు. అది లేకపోతే ఏ కోరికలు కూడా మనం భరించము. ఈనాటి మానవుడు అన్నమయ, ప్రాణమయ, మనోమయం వరకు మాత్రమే ప్రయాణం చేస్తున్నాడు. అందువల్లనే మానవునియొక్క బుద్ధి అంతా బహిర్ముఖముగా పోతున్నది. ఇంక విజ్ఞానమయ. అది అంతర్ముఖము. అంతర్ముఖమైన విజ్ఞానమయంలో దాగిఉన్నదే ఆనందమయము.

అన్నమయముతో ప్రారంభమై ఆనందమయంతో నీవు అంత్యము కావాలి గాని కేవలం మనోమయంతో అంతం కాకూడదు. మనోమయంతోనే మనము నిల్చి వేస్తున్నాము. కనుకనే మానవునియందు అనేక రకములైన అసురగుణములు అభివృద్ధి గాంచుతున్నాయి. నరునియందు ఈ అసురత్వం అభివృద్ధి కావటంవల్లనే నరక అసుర అన్నారు. ఈ అసురగుణములు ఎక్కడకు గొనిపోతున్నాయంటే నరకమునకు. ఈ అసుర గుణములు నరకమునకు గొనిపోయేవి కనుక అసుర గుణములను మొట్టమొదట మనం ఖండించాలి. ప్రతి మానవుని యందు ఈ అసురగుణము నరకుని రూపం ధరించి, ఆత్మను విస్మరించి కేవలం తన ఆనందం నిమిత్తమై మానవత్వాన్ని దూరం గావిస్తున్నారు. మానవత్వం మరచిపోవటం చేతనే ఈ అశాంతి విప్లవం జరుగుతూ వచ్చింది. కృష్ణుడనగా ఎవరు? పంచభూత స్వరూపుడైన పరమాత్ముడు. పరమాత్ముని ఆశ్రయించినప్పుడు ఈ అజ్ఞానమనే అసురత్వమైన నరకుని హింసించి మనకు శాంతి సంతోషములు లభింపచేస్తాడు. మానవునికి ముంచుకొస్తున్న భయాందోళనలకు కొంతవరకు కృష్ణుడు సహాయం చేయటంచేతనే ఆనందోత్సవాలు జరుపుకుంటూ ఆనాడీవిధముగా అనేక వేడుకలు చేసుకుంటూ వచ్చారు.

**దీపావళి పరమార్థము**

'ఏకంసత్ విప్రా బహుధావదంతి' ఉన్నది ఒక్కటే. 'ఏకోహం బహుస్యాం ఒక్క పరమాత్ముడే అనేకంగా రూపొందుతూ వచ్చాడు. అట్టి దివ్యబోధలు గావించే నిమిత్తమై ఒక క్యాండిల్ తీసుకుని పోయి మనం అనేక జ్యోతులను వెలిగిస్తాము. ఈనాడు దీపావళిరోజు. ఒక్క దీపము సహాయంతోనే అనేక వేల దీపాలనంతా వెలిగిస్తూ ఉంటాము. ఎప్పుడూ ఉండే జ్యోతి ఒక్కటే. వెలిగే జ్యోతులు అనేకం. వెలిగించే జ్యోతే పరంజ్యోతి. వెలిగే జ్యోతులే జీవన జ్యోతులు.

sri sathyasai vahanamrutam

సమస్త జీవన జ్యోతులు కూడా పరంజ్యోతితోనే వెలుగుతూ ఉంటాయి. ఇట్టి అంతరార్థమును ప్రజలకు బోధించే నిమిత్తమై, ఈనాడు దీపావళిరోజు, ఒక్కదీపముతో వెలిగించుకుంటూ ఆ ఏకత్వాన్ని స్మరించటానికి చిహ్నంగా రూపొందింప చేస్తూ వచ్చింది. ఒక్కొక్క పర్వదినమునకు ఒక్కొక్క అంతరార్థము లేకుండా పోలేదు. కానీ ఈ పర్వదినముయొక్క ప్రభావము మనము విస్మరించి కేవలము పాయసము పరమాన్నములతోనే పర్వదినములుగా గడుపుకుంటూ జీవితమును నిరర్థకము గావించుకుంటున్నాము.

భారతీయుల పర్వదినములు అర్థరహితములైనవి కాదు. ఆత్మమయమైనవి. ఆనందమయమైనవి. తెలిపేవారు లేకపోవటం చేత దీనిని సరిగా అర్థము చేసుకునే వ్యక్తులు తక్కువ కావటం చేత ఈ అనర్థములలో మునిగిపోతున్నాము. ఈనాడు నరకాసురవధ. ఎవరి సహాయముతో నరకాసురుని చంపాడు. సత్యభామ. సత్యమనగా truth. ఈ సత్యమును ఆధారము చేసుకునే సత్యమే పరమాత్మ స్వరూపముగా విశ్వసించి తద్వారా మనలో ఉండిన అసురత్వమును హతమార్చాలి. సత్యమేవ జయతే. అదే జయిస్తుంది. అందువలనే వేదమునందు సత్యంవద సత్యమును చెప్పాలి అని. ఇంక పురాణములు ఏమి చెప్పాయి. ఈ సత్యమును ఆచరణలో పెట్టి ఆనందముతో మన జీవితమును అనుభవింప చెయ్యాలి అని. ఒకానొక సమయంలో భూదేవి విష్ణువు దగ్గరకు వెళ్ళి చాలా బాధ పడిందట. హే మహాప్రభూ. ఎంతటి దుర్మార్గులనైనా నేను మోయగలనుగాని అసత్యవాదిని నేను మోయలేను అనిందట. ఈ అసత్యము ఉండటం చేతనే మానవత్వములో సర్వము మిథ్యమునే మారిపోతున్నది. సత్యము నిమిత్తమై తన సతిని బిడ్డలను కోల్పోయి కేవలము కాటికాపరిగా తయారయ్యాడు హరిశ్చంద్రుడు. సత్యమునకు తన జీవితమును అంకితము చేశాడు. అసత్యము దేశకాల పాత్రలకు అతీతమైందది.

**ప్రళయ నిర్ఘాత మరచేత పట్టవచ్చు**
**హేమశైలంబు కొనవ్రేల ఎత్తవచ్చు**
**దివిని భువిని రెంటి సంధింపవచ్చు**
**ధరహరిశ్చంద్రు బొంకింప తరముకాదు**

అలాంటి హరిశ్చంద్రతత్త్వము ఈనాడు లోకములో సార్థకముగాఉండుటకు కారణము సత్యమే.

srisathyasaivachanamrutam

ఇటువంటి సత్యనిమిత్తమై మానవుడు తగిన కృషి సల్పాలి. ఆ సత్యము తన ఆత్మస్వరూపమే. కనుక Truth is God. సత్యమే దైవమన్నారు. అట్టి సత్యమును ఆత్మ విశ్వాసమును మనము అభివృద్ధి గావించుకోవాలి. ఆత్మ విశ్వాసముతో అసురత్వముపై మనము దండెత్తినప్పుడు ఈ అసురత్వమును రూపు మాపవచ్చు. అట్లు లేకపోయినప్పుడు ఈ దేహమనే రాజ్యముపైన అనేక రాగములనే శత్రువుల చేత మృత్యువు వస్తుంది. కనుక మానవత్వము మనము కోల్పోక పూర్వమే సత్యాన్ని మనము గుర్తించాలి. ఆత్మను మనము దర్శించాలి.

ఆత్మ అనగా ఏమిటి? బ్రహ్మ అన్నారు. బ్రహ్మ అనగా ఏమిటి? చైతన్యము అన్నారు. ఈ చైతన్యమనేది సర్వత్ర ఉంటున్నది. ఈ సర్వత్ర ఉండిన చైతన్యమును మనము గుర్తించటమే ఏకత్వము. ఏకత్వమును దర్శించటమే మానవత్వము. Unity లోనే purity. Purity లోనే divinity. ఈనాడు unity అనేది యేమాత్రము లేదు. ఎప్పుడు ఆ యూనిటీ లేకుండా ఉంటుందో ఎనిమిటీ ప్రవేశిస్తుంది. ఈ ద్వేషము. ద్వేషము దినదినమునకు పెరిగిపోతున్నది. యూనిటీ లేకుండా పోతున్నది. దీనికి కారణము స్వార్థము స్వప్రయోజనము. ఈ స్వార్థము పోవాలి. స్వార్థము కొంతవరకు పెట్టుకోవచ్చు. స్వార్థము పోయేదికాదు. కాని సాధ్యమైనంత వరకు ప్రయత్న పూర్వకముగా కొంతవరకు తగ్గించుకోటానికి చూసుకోవాలి. దేహతత్త్వమును మాత్రమే పెంచుకోటానికి ప్రయత్నించరాదు. ఈ ఆత్మ తత్త్వాన్ని పొందే నిమిత్తమై దేహాన్ని కాపాడుకోవలసిందే. దేహము తాను కాదు.

**మలినపు కొంప రోగముల మగ్గెడు సేవక గంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మనమెప్పు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే!**

ఇది కేవలము నీటి బుడగవంటిది. నీయందే పుట్టింది. నీటియందే నిలిచింది. నీటియందే లయమైపోతుంది. అదే రీతిగనే ఈ దేహము బ్రహ్మనుండే పుట్టింది. బ్రహ్మలానే నిల్చింది. బ్రహ్మలోనే ఐక్యము కావాలి. ఏవిధముగా దివ్యత్వమును మనము స్మరించాలంటే ఈ దేహము పుట్టినది, దేహము పెరిగినది, ఉన్నది లయమై పోయేది సర్వము ఒక్కటే అని గుర్తించాలి.

srisathyasaivagamrutam

**నీటియందె పుట్టి నీటిపై తేలుచు**
**నీటి యందడంగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడునీరు**

ఎక్కడ నుండి వచ్చిందో అక్కడ లయమైపోవాలి.

మనము ప్రయాణము చేసేవారము మనగమ్యానికి పోయి చేరాలి. ఈ మధ్య స్టేషనులో మనము నిల్చిపోతే కష్టాలనుభవిస్తాము. ఎక్కడ నుంచి ప్రయాణమైనామో అక్కడికే మనము చేరాలి. అదే మానవుని ప్రధానకర్తవ్యము. అదే లక్ష్యము. దానిని మనము మరువరాదు. ఇట్టి లక్ష్యమును మనము జ్ఞప్తి యందుంచుకున్నప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. బ్రహ్మనుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు వాయువునుండి అగ్ని పుట్టింది. అగ్నినుండి నీరు పుట్టింది. నీరునుండి పృథ్వి పుట్టింది. నీటినుడి ఔషధము పుట్టాయి. పంటలు పుట్టాయి. దాని నుండి ప్రాణము వచ్చింది. కాబట్టి పురుషుడు ప్రాణస్వరూపుడు. కట్టకడపటికి పురుషునకు బ్రహ్మకు సన్నిహిత సంబంధము చేర్చాలి. చివరిది పురుషత్వము. మొదటిది బ్రహ్మతత్త్వము. ఈమాలను అనేక రకములుగా కట్టి రెండింటిని మనము చేర్చినప్పుడే ఒక మాలగా తయారౌతుంది. కష్టములతో నష్టములతో, దుఃఖములతో, విచారములతో కూర్చిన పుష్పములన్నియు ఒక మాలగా తయారుచేశారు. అదే జీవితహారము. ఈ జీవిత హారము లోపల ఐక్యత ముఖ్యము. ఈ అన్నింటిని చేర్చిన అంతర్వాహిని ప్రేమ ఒక్కటియే. పూలు అనేక రకములుగా ఉండవచ్చును. ఈనాటి పూలు రేపు వాడిపోవచ్చును. కాని దారము ఒక్కటే. నిన్నదారము. నేడు దారము. రేపు దారమే. పూవు ఈరోజు విచ్చుకోవటము రేపు వాడిపోవటము, కాలిపోయే దేహమనే పుష్పము లోపల కాలిపోని నిత్యమైన సత్యమైన బ్రహ్మసూత్రముగా ఉంటున్నది. ప్రతి మానవునియందు సూత్రమనే బ్రహ్మ ఉంటున్నాది. తనయందున్న బ్రహ్మను గుర్తించటానికి తాను ప్రయత్నించాలి. ఇది చాలా సత్యమని భావించినప్పుడు ఒక్క ప్రేమను పెంచుకుంటే చాలు. ఆ ప్రేమనే మనకు ప్రాణముగా నిలుస్తుంది. ఆ ప్రేమనే పరమాత్మ స్వరూపంగా దర్శించవచ్చు. ప్రేమతో భగవంతుని స్మరించటానికి ప్రయత్నించాలి.

**(తేది. 28-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam